క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ



పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న జువారి సిమెంట్ పరిశ్రమ అధికారులు

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చింతలపాలెం మండలం దొండపాడు గ్రామ పరిధిలోని జువారి సిమెంట్ పరిశ్రమ వారు సీఎస్ఆర్ ఫండ్ ద్వారా గురువారం కంప్యూటర్, ప్రింటర్ బహూకరించారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ జి.ఎస్.బీరావు, ప్రధానోపాధ్యాయుడు రాములు, పద్మాసింగ్ పాటిల్, కరణం ఉగేంద్ర పిళ్లై, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువజన అధ్యక్షుడిగా జానకిరామాచారి



జానకిరామాచారికి నియామకపత్రం అందజేస్తున్న ధనుంజయనాయుడు

గరిడేపల్లి : బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం గరిడేపల్లి అధ్యక్షుడిగా మండలంలోని ఎల్బీనగర్‌కు చెందిన తుంగతుర్తి జానకిరామాచారిని నియమించినట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ దూళిపాళ ధనుంజయనాయుడు తెలిపారు. గురువారం జానకిరామచారికి స్థానికంగా నియామకపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి సుందరయ్య, తునికిపాటి మల్లాచారి, జగన్నాథచారి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

కోదాడరూరల్ : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ సూచించారు. గురువారం కోదాడ పట్టణంలో హెల్మెంట్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న పలువురు వాహనదారులను ఆపి అవగాహన కల్పించి మాట్లాడారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్‌కు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా, మద్యం సేవించి, ర్యాష్ డ్రైవింగ్‌లు చేయొద్దని సూచించారు. ఆయన వెంట ఏఎస్ఐ సీఎస్‌రావు, హెడ్ కానిస్టేబుల్ సమ్మద్, సిబ్బంది శ్రీను, వెంకన్న, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

గిరిజన శక్తి మండల అధ్యక్షుడిగా ఈశ్వర్‌నాయక్



నియామకపత్రం అందుకుంటున్న ఈశ్వర్

మఠంపల్లి : గిరిజన శక్తి మఠంపల్లి మండల అధ్యక్షుడిగా మండలంలోని చెన్నాయిపాలెంకు చెందిన బానోతు ఈశ్వర్‌నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మధునాయక్.. ఈశ్వర్‌నాయక్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియాకానికి సహకరించిన సంఘం వ్యవస్థాకుడు డాక్టర్ వెంకటేష్‌చౌహాన్, రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర శరత్‌నాయక్, కార్యదర్శి మధునాయక్, సందీప్‌నాయక్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

కూచిపూడిలో ప్రభుత్వ భూమి సర్వే



ప్రభుత్వ భూమిని సర్వే చేస్తున్న అధికారులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడిలో సర్వే నంబర్ 225లో గల 31.8 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు ఇటీవల ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఆ భూమిలో కబ్జాలో ఉన్న 26 మందిని సర్వేకు హాజరు కావాలని కోరుతూ నోటీసులు జారీ చేశారు. గురువారం ఆ భూమిలో సర్వే అధికారులు, కోదాడ రెవెన్యూ అధికారులు గ్రామస్తులతో కలిసి సర్వేను ప్రారంభించారు. మరో మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి పూర్తి నివేదికను ఆర్డీఓకు అందజేస్తామని డీఐ మచ్యానాయక్, కోదాడ సర్వేయర్ నాగార్జునరావు తెలిపారు. గ్రామస్తులు చాప తిరపతయ్య, శెట్టి పూర్ణచందర్‌రావు, శెట్టి శ్రీనివాసరావు, చేతుల రామకృష్ణ, మిర్యాల నాగేశ్వరరావు, ఫకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పదహారేళ్లైనా పూర్తికాని పనులు

- 2008లో సంఘమిత్ర భవనం పనులు ప్రారంభం
- నాటి నుంచి నత్తనడకన..
- త్వరితగతిన పూర్తిచేయాలని మహిళా సంఘాల వేడుకోలు



అసంపూర్తిగా ఉన్న సంఘమిత్ర భవనం

గరిడేపల్లి : మండల కేంద్రంలో సంఘమిత్ర భవనం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2008లో ప్రారంభమైన పనులు నేటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం భవన నిర్మాణం మాత్రం పూర్తయినప్పటికీ నిధులు రాక తలుపులు, కిటికీలు, టైల్స్, రంగులు వంటి పనులు పూర్తి కాకపోవడంతో భవనం నిరుపయోగంగా ఉంటుంది. దీంతో ఆ భవనాన్ని చుట్టూ కంపచెట్లు కమ్మేశాయి.

మండలంలో 1150 సంఘాలు..

కాగా, రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సమభావన సంఘాలు తమ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు గాను 2008 సంవత్సరంలో రచ్చబండ కార్యక్రమం ద్వారా సంఘమిత్ర భవనాల నిర్మాణానికి నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాగా, మండల వ్యాప్తంగా సుమారు 1150 సమభావన సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 12 వేల మంది సభ్యులు ఉన్నారు. దీంతో గరిడేపల్లి మండల కేంద్రంలో సంఘ మిత్ర భవనం నిర్మించేందుకు నాటి ప్రభుత్వం రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసింది. సంబంధిత అధికారులు పనులు ప్రారంభించారు. కానీ నాటి నుంచి పనులు నిదానంగా సాగుతున్నాయి.

ఆకతాయిలకు అడ్డాగా..

సంఘమిత్ర భవనం నిరుపయోగంగా ఉండడంతో ఆకతాయిలకు అడ్డగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు, మద్యం సేవించేందుకు భవనాన్ని ఆకతాయిలు అడ్డగా మార్చుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం విషయాన్ని గత అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురాలేక పోయారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందించి సంఘమిత్ర భవనం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

> **నిధులు రాగానే పనులు పూర్తి చేస్తాం**
>
> సంఘమిత్ర భవనం పూర్తి కావడానికి సుమారు రూ.7 లక్షల నుంచి రూ.10లక్షల నిధులు అవసరం. నిధుల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం. ఈ విషయం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. నిధులు రాగానే పనులు పూర్తి చేసి భవనాన్ని ప్రారంభిస్తాం. – కళ్యాణ్, పీఆర్ ఏఈ

అందుబాటులో ఎరువులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నట్లు చైర్మన్ కలగొట్ల కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రోమోర్ 28.28.0, సూపర్, యూరియా 20.20.0, పొటాష్ తదితర ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అప్పన్నగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కీసర సంతోష్‌రెడ్డి

మోతె : మండలంలోని అప్పన్నగూడెం, బీక్యతండా, భల్లుతండా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, ఏఓ అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్‌గా రూ.500లు చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకయ్య, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సిరికొండ శ్రీను



నేరేడుచర్ల : సీపీఎం నేరేడుచర్ల మండల కార్యదర్శిగా సిరికొండ శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ముకుందాపురం గ్రామంలో బుధవారం జరిగిన పార్టీ మండల మహా సభలో శ్రీనును రెండవసారి మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండంలోని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు, డిగ్రీ విద్యార్థి ములకలపల్లి గురుమూర్తి సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు క్రీడాకారుడి కోచ్ పీఈటీ సతీష్ గురువారం తెలిపారు. ఈనెల 23న మహాత్మాగాంధీ యూనివర్సిటీ, అన్నెపర్తిలో జరిగిన సౌత్ జోన్ కబడ్డీ జట్ల ఎంపికలో తెలంగాణ జట్టుకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. గురుమూర్తి ప్రస్తుతం నల్గొండ ఎన్‌జీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 30న చెన్నైలోని పద్మశ్రీ మిల్కా సింగ్ స్టేడియంలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో కూడా గురుమూర్తి పాల్గొంటున్నట్లు తెలిపారు. కాగా, పలువురు క్రీడాకారులు గురుమూర్తిని అభినందించారు.

మేకల సాయి ఎంపిక

నడిగూడెం : ఈ నెల 30న తమిళనాడులో జరగనున్న సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు నడిగూడెం మండల కేంద్రానికి చెందిన మేకల సాయి ఎంపికయ్యాడు. దీంతో గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాయిని, సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి వేపూరి సుధీర్, వ్యాయామ ఉపాధ్యాయులు పల్లపు నాగేశ్వరరావు, పాతకొట్ల ప్రకాష్, కరుణాకర్, శ్రీరామ్, హరీష్, బన్నీ, సతీష్, శ్రీకాంత్, మహేష్, పాల్గొన్నారు.

మహా రుద్రాభిషేకం స్థల పరిశీలన



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు ఉన్నత పాఠశాలలో ఈనెల 27న నిర్వహించబోయే మహా రుద్రాభిషేకం స్థలాన్ని సీఐ చరమందరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అభిషేకం చేయబోయే స్థలం, వీఐపీ రాకపోకలు, గేటు, పార్కింగ్ స్థలాలను పరిశీలించి నిర్వహణ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు. తొలుత నిర్వహణ కమిటీ సభ్యులు ముువ్వన్నెల జెండాను ఎగురవేసి జాతీయగీతం ఆలపించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నావికా దళ క్విజ్ పోటీలకు 'తేజ' విద్యార్థుల ఎంపిక



సృజన్‌గుప్తా, కొండ్ర నవీన్‌కుమార్

కోదాడరూరల్ : భారత నావికా దళం 'థింక్యూ–2024' పేరుతో దేశ వ్యాప్తంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు సెప్టెంబర్‌లో జాతీయ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించింది. అందులో కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయ విద్యార్థులు సృజన్ గుప్తా, కొండ్ర నవీన్‌కుమార్‌లు ఫైనల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి గురువారం తెలిపారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 9 వేల పాఠశాలలు పాల్గొనగా మూడు దశల్లో రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర విభాగాలుగా నాలుగు ప్రాంతాల నుంచి తుది పోటీలకు అత్యుత్తమంగా నిలిచిన 16 పాఠశాలల టీమ్‌లను ఎంపిక చేశారు. తెలంగాణ నుంచి రెండు పాఠశాలలు ఈ పోటీలకు ఎంపికైన కాగ అందులో ఒకటి కొమరబండలోని తేజవిద్యాలయ పాఠశాల అని తెలిపారు. వీరు నవంబర్ 7, 8 తేదీల్లో కేరళలోని ఎజిమల భారతీయ నావికా శిక్షణ కేంద్రంలో నిర్వహించే క్విజ్ పోటీలకు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న బెజవాడ శ్రావణ్

నడిగూడెం : మండలంలోని శ్రీరంగాపురం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారు గుర్వయ్య (32) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. గురువారం మృతుని కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ నాయకుడు బెజవాడ శ్రావణ్ రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కోదాడ కౌన్సిలర్ బెజవాడ శిరీష, బత్తుల ఉపేందర్, మాజీ సర్పంచ్ లంజపల్లి నాగేశ్వరరావు, నూకపంగు ఈదయ్య, నాయకులు రెడ్డిమల్ల శ్రీను, సైదులు, శ్రీను, రాజు, పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన



రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాతా బృందం సభ్యులు

హుజూర్‌నగర్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లో పోలీస్ కళాజాతా బృందం రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో ఈ ప్రాంత యువకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. స్థానిక పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రబాబుకు సన్మానం



ఇంద్రబాబును సన్మానిస్తున్న మిత్రులు

హుజూర్‌నగర్ : తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పి.ఇంద్రబాబును మిత్రులు గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్‌లో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాబూరావు, అరుణ్, నరసింహారావు, వినోద్, రాజా, ప్రమోద్, ప్రసాద్, హరీష్, కిషోర్, ఇస్హాక్, నాగేందర్, శ్రీధర్, శ్రీనివాస్, విజయ్ సారధి, తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వినతి



కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వీఓఏలు

మోతె : మండలంలో ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ)లలో విధులు నిర్వహిస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వీఓఏల మండల అధ్యక్షురాలు కొమ్ము శ్రీలత, కార్యదర్శి దామళ్ల గురుస్వామి కోరారు. తమ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి తీసుకెళ్లాలని గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డికి వినతి పత్రం అంజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు గత కొంత కాలంగా ప్రభుత్వం అందిస్తున్న చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆదినారాయణ, అంబాల దుర్గయ్య, ముత్తయ్య, శ్రీను, కృష్ణ, ఉపేందర్, జయశ్రీ, సుజాత, యమున, లక్ష్మి పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కోదాడరూరల్ : పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరి వెంకటనారాయణ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సామిల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో మధ్య తరగతి, సామాన్య కార్మికులు రోజులు గడవక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సామిల్ కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామిల్ యూనియన్ అధ్యక్షుడు శేషయ్య, ఎం.ముత్యాలు, రమేష్, రామ్‌బ్రహ్మం, బాబు, వెంకన్న, శ్రీను, కొండయ్య ఉన్నారు.

నేటి నుంచి అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నదాన వితరణ కేంద్రంలో శుక్రవారం నుంచి డిసెంబర్ 3 వరకు దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదానానికి తొలుత కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, వ్యాపారవేత్త, మునగాలకు చెందిన నల్లపాటి శ్రీనివాస్ గురువారం రూ.41వేల విరాళం అందజేసినట్లు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో మునగాల పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారులు ప్రతిరోజూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. దాతలు ముందుకొచ్చి 41రోజుల పాటు కొనసాగే అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పట్టు రైతులకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న రీజినల్ రీసెర్చ్ సెంటర్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ముత్యాలు

గరిడేపల్లి: ఉమ్మడి జిల్లాలో పట్టు పురుగుల పెంపకం (సెరికల్చర్)పై ఆసక్తి గల రైతులకు గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని గురువారం కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేష్ ప్రారంభించారు. కేంద్రీయ పట్టు పరిశోధనా కేంద్రం రీజినల్ రీసెర్చ్ సెంటర్, ములుగు ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కేంద్రీయ పట్టు పరిశోధనా కేంద్రం రీజినల్ రీసెర్చ్ సెంటర్ రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల అసిస్టెంట్ డైరెక్టర్ ఏ. ముత్యాలు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టు ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలపై ఎంపిక చేసిన రైతులకు కేవీకే ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పట్టు రైతులకు ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ద్వారా తగు సహకారం అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వినోద్‌యాదవ్ మాట్లాడుతూ.. మన దేశంలో పట్టు 39వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అయితే డిమాండ్ మాత్రం 65వేల టన్నులు ఉందని అన్నారు. పట్టు పురుగుల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని అన్నారు. కేవీకే పట్టు పరిశ్రమ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి. మాధురి పట్టు సాగులో మెలకువల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉషారాణి, రాఘవేందర్, టెక్నికల్ ఆఫీసర్స్, కేవీకే శాస్త్రవేత్తలు డి. ఆదర్శ్, నరేష్, 30 మంది రైతులు పాల్గొన్నారు.

మహిళలను చైతన్యపరిచేందుకు కృషి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి

హుజూర్‌నగర్ : మహిళలను చైతన్య పరిచేందుకు జాతీయ మహిళా సమాఖ్య నిరంతరం కృషి చేస్తుందని ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో మహిళా సమాఖ్య సభ్యత్వ నమోదును ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను నిరోధించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికారులు చిత్తశుద్ధితో మహిళల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి వై.ఉమ, సీపీఐ పట్టణ కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, నాయకులు సావిత్రమ్మ, రమాదేవి, లక్ష్మి, తిరుపతమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సత్కారం



బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సన్మానిస్తున్న సిబ్బంది

మునగాల : మండల విద్యాశాఖలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు ఎస్ఎస్ఏ సిబ్బంది గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికి సత్కరించారు. మండల విద్యా శాఖ అధికారిగా దీర్ఘకాలం పనిచేసిన ఎండీ.సలీమ్ షరీఫ్‌తో పాటు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి నారాయణగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన డి.సీతారామరాజును శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఇటీవల మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా నియామకమైన స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడతల వెంకటేశ్వర్లును కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాంబాబు, ఎల్‌డీఏ ప్రసాద్, సీఆర్పీలు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు ,కోటేశ్వరరావు, ఐఈఆర్పీలు కవిత, శ్రీదేవి, మెసెంజర్ శ్రీను ఉన్నారు.

స్వదేశీ మేళాలో సతీష్ మహిళా డప్పు కళాబృందం



సతీష్ మహిళా డప్పు కళాకారుల బృందాన్ని సన్మానిస్తున్న నిర్వాహకులు

గరిడేపల్లి: హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో గల పీపుల్ ప్లాజా ఆవరణలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాలో గురువారం గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ మహిళా డప్పు కళాకారుల బృందం పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. ఈ అవకాశం కల్పించిన అనిల్‌కుమార్‌కి మాస్టర్ అమరవరపు సతీష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రదర్శన అనంతరం సతీష్ మహిళా డప్పు కళాకారుల బృందాన్ని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు అపర్ణ, లావణ్య, ధనలక్ష్మి, రాణి, వీరబాబు, శోభన్, ఎలీషా, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



శ్రీనుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని రామాపురంనకు చెందిన నాగమల్ల శ్రీనుకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60 వేల సీఎం సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ పార్టీ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి గురువారం లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ వర్కింగ్ అధ్యక్షుడు సయ్యద్ ముస్తఫా, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగిలి వెంకటేశ్వర్లు, కొదమగుండ్ల నాగరాజు, పిల్లలమర్రి హరిబాబు, బొల్లెద్దు నాగరాజు తదితరులు ఉన్నారు.

ఇథనాల్ పరిశ్రమ రద్దు చేసే వరకు పోరాడుదాం



మాట్లాడుతున్న కారింగుల వెంకన్న

చివ్వెంల : మోతె మండలంలోని రావిపహాడ్ గ్రామంలో చేపడుతున్న ఎస్ఎంకే ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసే వరకు పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. గురువారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాలని చూడగా, ముందస్తు అరెస్ట్ పేరుతో జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్‌ను సూర్యాపేట టౌన్ పోలీసులు తెల్లవారుజామున అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారని అన్నారు. అక్రమ అరెస్ట్‌లతో పోరాటాన్ని ఆపలేరన్నారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు కలిగించి, వేలాది ఎకరాల భూములను బీడు భూములుగా మార్చే పరిశ్రమను రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, పిడమర్తి లింగయ్య, గులాం హుస్సేన్, మారసాని చంద్రకళ, సంతోషిమాత, జయమ్మ, మోహన్, పద్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరుపై ముస్లిం నాయకుల హర్షం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఈద్గాకు ప్రహరీ గోడ నిర్మాణానికి, అంతర్గత రోడ్లకు తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.52 లక్షలు మంజూరు చేయించినట్లు స్థానిక ముస్లిం నాయకులు అజీజ్ పాషా, మజీద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిధులు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేయించిన మంత్రికి, సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రవి, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన అల్వాల సైదులు– శైలజ దంపతుల కుమారుడు వినయ్‌గౌడ్ పుట్టినరోజును పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ కుమారుడు వినయ్‌గౌడ్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడని, అతని జ్ఞాపకార్థం అన్నదానం చేసినట్లు తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, అశోక్‌గౌడ్, నరేష్, పరుశరామ్, మణికంఠగౌడ్, కృష్ణ, ఆశ్రమ నిర్వాహకురాలు విజయమ్మ పాల్గొన్నారు.

డయేరియాతో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): డయేరియాతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. చింతలపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నాలుగు రోజుల క్రితం డయేరియాతో బాధపడుతూ స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వెళ్లగా వైద్యాధికారులు వారిని హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. అక్కడ నుంచి వారిని మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేయగా.. అక్కడ చికిత్స పొందుతూ వారిద్దరు గురువారం మృతి చెందినట్లు స్థానిక వాట్సప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది. ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్‌ను సంప్రదించగా.. డయేరియా తీవ్రంగా ఉన్న వారిని హుజూర్‌నగర్‌కు రిఫర్ చేస్తున్నామని చెప్పారు. కాగా ఆ ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన విషయం తమకు తెలియదని అన్నారు. పూర్తి సమాచారం తెలుసుకున్నాక వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.